# అందితే జుట్టు



**న**గరంలో అలజడి ఎక్కువగా ఉంది.

ఆందోళన శ్రుతి మించడంతో గత రాత్రినుంచి కర్ఫ్యూ అమల్లో ఉంది. అత్యవసర విధుల మీద వెళ్లవలసిన వాళ్ళకి కర్ఫ్యూ పాస్‌లు ఇస్తున్నారు. అటువంటి వారి సౌకర్యం కోసం లిమిటెడ్‌గా ఆటోలకి, టాక్సీలకి కూడా పాస్‌లు ఇచ్చారు.

క్రిందటిరోజు రాఘవ, సారథి తమ ఎమ్మెల్యేగార్ని కలుసుకోడానికి న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌కి వచ్చారు. వాళ్ళు అక్కడ వుండగానే ఆందోళన ఉధృతం కావడం వల్ల కర్ఫ్యూ విధించడంతో వాళ్ళు అక్కడ చిక్కడిపోయారు. క్వార్టర్స్‌లోనే ఒక అధికారి బయటకు పోవలసినవాళ్ళకు పాస్‌లు ఇస్తున్నాడు. వాళ్ళిద్దరూ ఆయన దగ్గర పాస్‌లు తీసుకున్నారు.

ఎమ్మెల్యేగారు- ఊళ్లో అల్లరి ఎక్కువగా ఉన్న దృష్ట్యా, వారిద్దర్నీ ఆరోజుకి తనతో ఉండిపోయి మర్నాడు వెళ్లమన్నాడు.

అందుకు వారూ ఒప్పుకున్నారు. మర్నాడు భోజనాలు కూడా ఆయనే పెట్టించాడు. తర్వాత వెళ్లడానికి వాళ్ళు సిద్ధపడ్డారు.

రాఘువ, సారథిలది నగరానికి పన్నెండు మైళ్ల దూరంలో ఉన్న గ్రామం.

ఎమ్మెల్యేగారు కూడా ఆ ఊరివాడే! అందుకే వారికి ఆయనతో బాగా పరిచయం. వాళ్ళిద్దరూ రావడం- స్వంత స్కూటర్ మీద వచ్చారు. తిరిగి దాని మీదే వెళ్లాలంటే వారికి ధైర్యం చాలలేదు. దారిలో ఏ ఆందోళనకారులైనా దానికి నిప్పు పెడ్తే?! ఈ రిస్కు ఎందుకని ఆటోలో బస్‌డిపోకి పోయి అక్కడినించి బస్‌లో పోవాలనుకున్నారు. సాయుధ పోలీసులతో కొద్దిపాటి బస్‌లు నడుస్తున్నాయి.

స్కూటర్ మరోసారి వచ్చి తీసుకుంటామని ఎమ్మెల్యేగారికి చెప్పి వాళ్ళిద్దరూ బయటకు వచ్చారు.

ఒక ఆటో ఖాళీగావుంది. డ్రైవర్ నిద్రకళ్లతో కూర్చుని ఈగల్ని తోలుకుంటున్నాడు.

"డ్రైవర్... బస్‌డిపోకి వస్తావా..?" అన్నాడు రాఘువ.

"వస్తాను. మీటర్ కాకుండా ఐదు రూపాయిలు ఎక్కువ ఇయ్యాలి."

"అరె... మీటర్ ఛార్జే మూడు రూపాయలు కాదు. ఐదు రూపాయలు ఎక్కువా?

"ఈ కర్ఫ్యూ సమయంలో బయటకి ఎవరు వస్తారు సార్?" అన్నాడు డ్రైవర్.

అంత ఎక్కువ వాడికిచ్చేదేమిటని, "ఒరేయ్ పదరా... గన్‌ఫౌండ్రిలో మన స్కూటర్ తీసుకుపోదాం!" అంటూ రాఘువ ముందుకు నడిచాడు.

వాళ్ళు నాలుగడుగులు వేశారో, లేదో... ఆటోడ్రైవర్ ఆటోతో వచ్చి, "ఎక్కండి సార్... మీటర్ ఛార్జీ ఇయ్యండి!" అన్నాడు.

"అవసరం లేదు. మీటర్ ఛార్జికంటె రూపాయి తక్కువ ఇస్తాం. వస్తే రా..!" అంటూ ముందుకుసాగారు.

"సరే... ఎక్కండి సార్!" అంటూ వారిని ఎక్కించుకొని వెళ్లాడు.

బస్‌స్టాండ్‌లో- "అందితే జుట్టు, అందకపోతే కాళ్లు అన్నట్లు ప్రవర్తించకు. అవసరాలు అందరికీ ఉంటాయి. ఇదిగో- మీటర్ ఛార్జీ చొప్పునే ఇస్తున్నాను" అంటూ డబ్బులిచ్చాడు రాఘువ.

*- పల్లకి వార పత్రిక...12 జూలై '84*